క్లుప్తంగా

ఓ వైపు నాటుతుంటే.. మరో వైపు నరుకుతున్నారు..



రావినారాయణరెడ్డినగర్ ఈస్ట్‌లో చెట్టును నరికివేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: పచ్చదనం పెంపొందించడానికి ఓవైపు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంటే మరోవైపు కొంతమంది నిర్లక్ష్యంగా వృక్షాలను విచక్షణారహితంగా నరికేస్తున్నారు. గాజులరామారం డివిజన్ రావినారాయణరెడ్డినగర్ ఈస్ట్‌లో ఓ వ్యక్తి తన ఇంటి ముందున్న రెండు చెట్లను శుక్రవారం నరికి వేశాడు. దీంతో స్థానికులు అతనిపై మండిపడ్డారు. ఒకప్పుడు మురికివాడ ప్రాంతంగా ఉన్న రావినారాయణరెడ్డినగర్‌ను బస్తీవాసులు ఏకమై పెద్ద ఎత్తున మొక్కలు నాటి పచ్చదనానికి పెద్దపీట వేశారు. దీంతో జీహెచ్ఎంసీ నుంచి రావినారాయణరెడ్డి నగర్ అవార్డు కూడా సొంతం చేసుకుంది.

నేడు నిజాంపేట్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నిజాంపేట్: నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అధ్యక్షతన శనివారం ప్రగతినగర్‌లోని శ్రీకృష్ణ గార్డెన్స్‌లో నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం జరుగనుంది. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన ఇన్‌చార్జ్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి, నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ లు హాజరుకానున్నారని తెలిపారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, అనుబంధ కమిటీల సభ్యులు హాజరు కావాలని మేయర్ ఓ ప్రకటనలో కోరారు.

'హై లైఫ్' అదిరింది

మాదాపూర్: అరుదైన ఆభరణాలు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం హైలైఫ్ జ్యువెల్ ఎగ్జిబిషన్‌ను సినీనటి నిత్యా నరేశ్ నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాహాది శుభకార్యాలకు ప్రముఖ డిజైనర్లు రూపొందించిన జువెలరీ ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మూడురోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో టాప్ జ్యూలరీ బ్రాండ్స్, దేశం నలుమూలల నుంచి సేకరించిన జ్యూలరీ డిజైన్స్ మాస్టర్ పీస్‌లు, ప్రీమియం జువెలరీ అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు డిజైనర్లు, మోడల్స్ పాల్గొన్నారు.

జీవో.14 ప్రకారం జీతాలు ఇవ్వాలి

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని వాటర్ సెక్షన్ కార్యాలయం వద్ద శుక్రవారం డివిజన్ 9 మూసాపేట సెక్షన్ జలమండలి ఔట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పోస్ట్‌కార్డులను పంపించారు. జీవో 14 ద్వారా జీతాలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఇస్తున్న జీతాలు చాలటం లేదని తెలిపారు. ఈనెల 20వ తేదీ లోగా సమస్యను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వినయ్, రాజు, పోచయ్య, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ సమతానగర్‌లోని శ్రీ విశాలాక్షి అమ్మవారి ఆలయంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హుండీ పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. ఉదయం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీసీ ఫుటేజీలో చోరీ దృశ్యాలు రికార్డు అయ్యాయని భక్తులు తెలిపారు. అమ్మవారి మెడలో ఉన్న రోల్‌గోల్డ్ నగలను ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతం

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. వెస్ట్రన్‌హిల్స్ ఫీడర్ పరిధిలోని అడ్డగుట్టలో శనివారం ఉదయం 8.30 నుంచి 9.30గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

17న గుండె జబ్బులపై అవగాహన

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నం.4లోని ప్రసాద్ క్లినిక్‌లో 17వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు గుండె వ్యాధులు, సంబంధిత నొప్పులపై ఉచితంగా సలహాలు, చికిత్స అందించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. 2డీ ఎకోపై 50శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 8096000600.

డా.బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళులు

భారతరత్న డాక్టర్ భీమ్‌రావ్ రాంజీ అంబేడ్కర్ జయంతి వేడుకలు శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. వాడవాడలా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం రూపకల్పనతో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి హక్కులు కల్పించడంతో పాటు వారు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు అంబేడ్కర్ కృషి చేశారని కొనియాడారు. నేటి తరం అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని సమసమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు.

– కుత్బుల్లాపూర్



ప్రగతినగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ నీలారెడ్డి



కొంపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ సన్న కవిత, మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కౌన్సిలర్లు



జీడిమెట్లలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి



కొంపల్లిలో పాల్గొన్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బీఆర్ఎస్ నేత జెమ్మి దేవేందర్‌నాగమణి, బీజేపీ నేత రాజిరెడ్డి, కౌన్సిలర్లు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్.. చిత్రంలో కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్



జగద్గిరిగుట్టలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి



సూరారం అంబేడ్కర్ భవన్ వద్ద దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో..



బాపూనగర్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్



కుత్బుల్లాపూర్ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ గౌరీష్, దళిత సంఘాల నేతలు



భౌరంపేట్‌లో నివాళులర్పిస్తున్న కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, శంభీపూర్ కృష్ణ



జగద్గిరిగుట్టలో కార్పొరేటర్ జగన్, దళిత సంఘాల నేతలు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేడ్చల్ జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి



సూరారం నార్త్‌సిటీ హైస్కూల్‌లో

అంబేడ్కర్ వేషధారణలో ఉన్న చిన్నారులతో ప్రిన్సిపాల్ కోలా వెంకటేష్



దుండిగల్‌లో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, మాజీ ఎంపీపీ చినంగి వెంకటేశం ముదిరాజ్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, దళిత సంఘాల నేతలు



జగద్గిరిగుట్ట పోలీస్ ఔట్‌పోస్ట్ వద్ద విద్యార్థి జేఏసీ నాయకుడు సాయికుమార్

నిర్మాణంపై ఆరా తీస్తున్న అధికారులతో వాగ్వాదం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ సర్వే నంబర్ 79 ప్రాంతం శుక్రవారం రణరంగంగా మారింది. స్థానికంగా 79 సర్వే నంబర్‌లో టీఎస్ఐఐసీకి చెందిన స్థలంలో ఓ వ్యక్తి నిర్మాణం చేపట్టడంతో సమాచారం అందుకున్న టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ మాధవి, స్థానిక తహసీల్దార్ సంజీవరావుతో కలిసి అక్కడ చేరుకుని నిర్మాణంపై ఆరా తీశారు. ఇంతలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు హల్‌చల్ చేశాడు. కొంతమంది స్థానికంగా ఉండే మహిళలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. శనివారం పోలీసుల సహాయంతో నిర్మాణాన్ని తొలగిస్తామని పేర్కొంటూ అధికారులు వెనుదిరిగారు.



సర్వే నం.79లో నిర్మాణంపై ఆరా తీస్తున్న తహసీల్దార్, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్

'పల్లెపల్లెకు ఓబీసీ... ఇంటింటికీ బీజేపీ'

కూకట్‌పల్లి: సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం కూకట్‌పల్లి డివిజన్‌లో «పల్లెపల్లెకు ఓబీసీ... ఇంటింటికీ బీజేపీ» కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల్లో సాధించిన విజయాలు, ఓబీసీల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను తెలిపే కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు ఎన్నో ప్రయోజనాలు చేకూర్చిందన్నారు. కేంద్ర మంత్రివర్గంలో 27 మంది ఓబీసీలకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేవలం ముగ్గురు ఓబీసీలకు మాత్రమే చోటు కల్పించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ లీగల్‌సెల్ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మన్నే భాస్కర్, నాయకులు శంకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మాధవరం కాంతరావు

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్

రాయదుర్గం: సొంత క్యాంపస్‌ను శుభ్రం చేసుకోవాలని హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్ఎస్ సర్రాజు హెచ్‌సీయూ విద్యార్థులకు సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో పార్కు క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో క్లీనప్‌డ్రైవ్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు క్యాంపస్ పరిసరాలలో మార్పులు తీసుకొచ్చే బాధ్యతను తీసుకోవాలన్నారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పార్కులో వ్యర్థాలు, చెత్తాచెదారంను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు బీంసింగ్, రాణిరత్నప్రభ, అరుణ, స్టూడెంట్ కోఆర్డినేటర్లు సాయి, అనురాగ్, ఉద్యోగులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో వీసీ సర్రాజు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధికారులు, విద్యార్థులు

పాలిటెక్నిక్ విద్యార్థులకు అవార్డులు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలో గిర్మాపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో పలు అవార్డులు దక్కాయి. సికింద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సృజన టెక్ ఫెస్ట్‌లో గిర్మాపూర్ కళాశాలకు చెందిన విద్యార్థికి ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగంలో అవార్డు లభించింది. కళాశాలకు చెందిన స్పందన్, అనిల్, శివాని, దీక్షిత, హరీష్‌కు ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటరమణ, పుల్లయ్య అవార్డులను అందజేశారు.

ఉత్సాహంగా వార్షికోత్సవం

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లో గల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 15వ వార్షికోత్సవాన్ని నిర్వాణ 2కె 23 పేరుతో ఘనంగా నిర్వహించారు. జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ నర్సింహారెడ్డి హాజరై ప్రసంగించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హైకోర్టు సీనియర్ న్యాయవాది రామకృష్ణారెడ్డి, కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి, సెక్రటరీ వేములు కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, భరతసింహారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

ఏసీపీ చంద్రశేఖర్



భాగ్యనగర్‌కాలనీ: మీడియా ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులపై తగిన చర్యలు తీసుకుంటామని కూకట్‌పల్లి ఏసీపీ ఎ. చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లితో పాటు పలు ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకుంటున్న.. బోర్లు వేసుకుంటున్న వారినే టార్గెట్ చేసి కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. కొత్తగా నిర్మాణాలు చేపట్టే భవనాల వద్దకు వచ్చి నిబంధనల పేరుతో కొందరు పాత్రికేయులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్‌టీఐ చట్టం కింద దరఖాస్తు చేసి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. అటువంటి వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేయటమే కాకుండా వీరి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి తమకు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంబేడ్కర్ పెయింటింగ్‌లు





నిజాంపేట్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన పెయింటింగ్ పోటీల్లో ప్రగతినగర్‌కు చెందిన సద్గురు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన 125 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 125 అడుగుల సైజ్‌లో అంబేడ్కర్ జీవిత ఘట్టాన్ని చిత్రీకరించి సరికొత్త రికార్డు నమోదు చేశారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. పనుల్లో జాప్యం

చింతల్: పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎక్కడపడితే అక్కడ మ్యాన్‌హోళ్ల నోళ్లు తెరిచి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఒక ఏజెన్సీ రెండు మూడు సెక్షన్లలో టెండర్లను దక్కించుకుని ఇష్టానుసారంగా వ్యవహరించడంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారయ్యిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చింతల్ సెక్షన్ పరిధిలో భూమిరెడ్డి కాలనీలో మ్యాన్‌హోల్ మూత తెరిచి ఉండటంతో ప్రమాదంగా ఉంది. ఇది గమనించక పలువులు రాత్రి సమయాల్లో అందులో పడి గాయాలు పాలైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

◆ ఈ విషయమై పలుమార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో స్థానికులు మ్యాన్‌హోల్‌లో ప్రమాద సూచికగా జెండా కర్రను అమర్చారు. అదేవిధంగా షాపూర్‌నగర్ సెక్షన్ పరిధి షాపూర్‌నగర్‌లోని సాయిబాబా ఆలయం వద్ద వారం రోజులుగా డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. దీంతో స్థానికులు మ్యాన్‌హోల్‌లో వ్యర్థాలు తొలగించాలని షాపూర్‌నగర్ సెక్షన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా వ్యర్థాలను ఇప్పటి వరకు ఎవరూ కన్నెత్తిచూడడం లేదని వాపోతున్నారు. షాపూర్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో అనేక చోట్ల మ్యాన్‌హోళ్లు తెరిచి ఉంచడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఉదయమే కార్యాలయాలకు వస్తున్నామని చెబుతున్న కొంతమంది అధికారులు చిన్నపాటి సమస్యలను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



షాపూర్‌నగర్ సాయి బాబా ఆలయం వద్ద



భూమిరెడ్డినగర్‌లో ప్రమాద సూచిక